సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



రేషన్ కార్డులు ఎప్పుడొస్తాయో..

ప్రభుత్వం రేషన్ కార్డులు ఎప్పుడు మంజూరు చేస్తుందోనని పలువురు అర్హులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు.

8లో



కట్టుబట్టలే మిగిలాయి..

ఒక్కసారిగా వచ్చిన వరదలతో సర్వం కోల్పోయామని బాధితులు కేంద్ర అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

8లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. సాయంత్రం అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కనుల విందుగా కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో గురువారం స్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

కలెక్టరేట్ ఏఓగా రమాదేవి



కలెక్టరేట్ ఏఓకు మొక్కను అందజేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్ ఏఓగా ఎం.రమాదేవిని నియమిస్తూ కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన ఆమె బుధవారం ఏఓగా బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్ ఏఓగా ఉన్న గన్యాను భద్రాచలం ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా బదిలీ చేశారు. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంరవి ఆధ్వర్యంలో ఉద్యోగులు నూతన ఏఓని కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతిని కాపాడుకోవాలి



శ్రీనివాసరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కొత్తగూడెంటౌన్: ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి జి.కిష్టాగౌడ్ సూచించారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం సీఎస్ఆర్ సెంట్రల్ పార్కులో బుధవారం అటవీ అమరవీరుల స్మారకోత్సవ సభ నిర్వహించారు. అటవీప్రాంతంలో విధులు నిర్వర్తిస్తూ వీరమరణం పొందిన అధికారి చలమల శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డీఎఫ్ఓ మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడటం మన కర్తవ్యమని, అటవీ సంరక్షణలో ప్రాణాలర్పించిన అమర వీరుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు యూ.కోటేశ్వరావు, కె.దామోదర్ రెడ్డి, బి.బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఈఓ

దమ్మపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వ రాచారి తెలిపారు. బుధవారం మండలంలోని గండుగులపల్లి, నాగుపల్లి జెడ్పీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటల్ తరగతుల బోధన, ఎఫ్ఆర్ఎస్ నమోదు, మధ్యాహ్న భోజన పథకం అమలు, స్కూల్ గార్డెన్ నిర్వహణపై హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో సమీక్షించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి సామర్థ్యాలను పరిశీలించారు. నాగుపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. గండుగులపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. విద్యాశాఖ అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలో భవిత కేంద్రం ఏర్పాటుకు రూ.17.5 లక్షలు మంజూరు చేయించగా, మండలంలోని మందలపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో కేంద్రం ఏర్పాటు చేస్తామని డీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్ ఎస్కే సైదులు, ఎంఈఓ లక్ష్మి, మండల నోడల్ అధికారి జగపతి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు కడగండ్లు!



పాల్వంచ మండలంలో సీతారామ ప్రధాన కాల్వకు గండి కొట్టిన ప్రదేశం

ఓవైపు వరద ముప్పుతో రాష్ట్రం అతలాకుతలం అవుతుంటే జిల్లాకు చెందిన సాగునీటి శాఖ అధికారులకు చీమ కుట్టినట్టయినా లేదు. ప్రభుత్వ ఉద్యోగులుగా వరద ముప్పు నుంచి ప్రజలను కాపాడాల్సింది పోయి మరింత కష్టాల్లోకి నెట్టేస్తున్నారనే అపవాదు ఎదుర్కొంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఏజెన్సీ వాసులంటే అంత చులకనా..?

- సీతారామ ప్రధాన కాలువ డిజైన్‌లో లోపాలు
- ప్రధాన కాలువకు ప్రతీసారి ఏకపక్షంగా గండ్లు
- కాలువ గండితో మునుగుతున్న పంట పొలాలు
- కనీస సమాచారం ఇవ్వని ఇరిగేషన్ శాఖ
- పంటలకు పరిహారం మాటెత్తేవారే లేరు..

భద్రాద్రికి అన్యాయం..

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు కారణంగా జిల్లాకు చెందిన రైతులే ఎక్కువగా భూములు కోల్పోయారు. ఈ జిల్లాకు చెందిన అటవీ సంపదకే ఎక్కువ నష్టం వాటిల్లింది. కానీ ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాలో కేవలం రెండు లక్షల ఎకరాల ఆయకట్టు మాత్రమే కొత్తగా అందుబాటులోకి వస్తుంది. ఖమ్మం జిల్లా పరిధిలో ఏకంగా 4.50 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు రానుంది. దీంతో ఈ పథకం వల్ల గరిష్టంగా ఖమ్మం జిల్లాకు లబ్ధి చేకూరుస్తూ భద్రాద్రి జిల్లాకు అన్యాయం జరుగుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇవి చాలదన్నట్టు సాగునీటి శాఖ అధికారుల నిర్వాకంతో మరో కొత్త వివాదం తెరపైకి వస్తోంది.

గండ్ల కాలువ..

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన మూడు ప్రధాన పంప్‌హౌస్‌లు, ట్రంక్ కెనాల్ ఈ జిల్లాలోనే ఉన్నాయి. అయితే ప్రాజెక్టు డిజైన్ సందర్భంగా పంపుహౌస్‌ల భద్రత, ప్రధాన కాలువ నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని అదనపు వరద వెళ్లేలా ఎస్కేప్ చానల్ నిర్మించాల్సి ఉంది. కానీ ప్రారంభ నిర్మాణ పనుల్లో ఎస్కేప్ చానల్‌కు చోటు కల్పించలేదు. దీంతో ప్రతీ వర్షాకాలంలో వచ్చే వరద కారణంగా ప్రధాన కాలువలో భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో కాలువ భద్రత, పంప్‌హౌస్‌ల పరిరక్షణ పేరుతో సాగునీటి శాఖ అధికారులు కాలువకు గండి కొట్టి నీటిని బయటకు పంపిస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఈ తంతు కొనసాగుతోంది. దీంతో ప్రధాన కాలువ కాస్త గండ్ల కాలువగా మారిపోయింది.

రైతులకు తప్పని నష్టం..

సాగునీటి శాఖ నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రధాన కాలువ గండితో వచ్చిన వరదలతో రైతులు ప్రతీ సంవత్సరం నష్టపోతూనే ఉన్నారు. వారికి కనీసం పరిహారం ఇవ్వడంపై కూడా సాగునీటి శాఖ దృష్టి సారించడం లేదు. ఏజెన్సీ జిల్లాకు చెందిన రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని సాగునీటి శాఖ అధికారులు ఒకే తప్పును పదే పదే చేస్తున్నప్పటికీ ప్రశ్నించేవారు కరువయ్యారు. వానలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందిస్తే అందినట్టు లేకుంటే లేదన్నట్టుగా మారింది బాధిత రైతుల పరిస్థితి.

చెప్పాపెట్టకుండా చర్యలు..

ప్రధాన కాలువకు ఎక్కడైనా గండి కొడితే ఆ నీరు పల్లపు ప్రాంతం మీదుగా ప్రవహిస్తుంది. ఈ క్రమంలో వందలు, వేల ఎకరాల్లో పంటలు నాశనం అవుతున్నాయి. పొలాల్లో ఇసుక మేటలు వేస్తున్నాయి. గండి పెట్టే సమయంలో సమీప ప్రాంతాల రైతులు, పల్లపు ప్రాంతాలకు చెందిన గ్రామీణులకు ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది సూచన ప్రాయంగా కూడా సమాచారం ఇవ్వడం లేదు. ఏకపక్షంగా గండి కొట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఆకస్మికంగా వరద నీరు పోటెత్తి రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల ప్రాణ నష్టం చోటు చేసుకుంటోంది. అయినప్పటికీ సాగునీటి శాఖ ఆ అంశాలను పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం.

రూ.లక్ష నష్టపోయా



మూడెకరాల్లో పత్తి పంట వేశాను. లక్ష రూపాయలు పెట్టుబడి అయింది. సీతారామ కాలువకు గండి తీయడంతో పంటంతా కొట్టుకుపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా మేము నష్టపోతున్నాం. ప్రభుత్వమే మాకు పరిహారం చెల్లించాలి.

– పోట్రు రాము, మద్దుకూరు, చండ్రుగొండ మండలం

మూడేళ్లుగా ఇదే పరిస్థితి



సీతారామ కాలువకు వర్షాకాలంలో గండి తీస్తున్నారు. దీంతో దిగువ భాగంలో ఉన్న మా పంట పొలాలు వరద ఉధృతికి నాశనం అవుతున్నాయి. ఆర్థికంగా నష్టపోతున్న మాకు ప్రభుత్వమే న్యాయం చేయాలి.

– పోట్రు వినోద, మద్దుకూరు, చండ్రుగొండ మండలం

కరకట్ట నిర్మాణ ప్రాంతంలో మంత్రి తుమ్మల, కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్, పీఓ రాహుల్ తదితరులు



బాధితులకు త్వరితగతిన పరిహారం

- వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- గోదావరి వరదల సమీక్షలో మంత్రి తుమ్మల

భద్రాచలం: సత్వరమే సర్వే పూర్తి చేసి గోదావరి వరదలు, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. బుధవారం భద్రాచలంలోని సబ్ కలెక్టరేట్‌లో గోదావరి వరదలపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాచలం ఏజెన్సీలో గోదావరి వరద మూడో ప్రమాద హెచ్చరిక దాటినా నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో తీసుకున్న ముందస్తు చర్యలతో ఈఏడాది ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో రూ. 40 కోట్లతో నిర్మిస్తున్న కొత్త కరకట్ట నిర్మాణం ముంపు కాలనీలకు వరంగా మారిందని పేర్కొన్నారు. గోదావరి రివర్ బెల్ట్ పరీవాహక ప్రాంతంలో కరకట్ట నిర్మాణం, ఇతర ప్రణాళికలను సీఎం దృష్టికి తీసుకెళ్లి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

వరదలు, వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు సత్వరమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, అన్ని మండలాల్లో రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు, భవనాల నష్టంపై సర్వే నిర్వహించి, ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందచేయాలని ఆదేశించారు. వరదల సమయంలో భద్రాచలం నుంచి వాజేడు మండలం వరకు తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. సివిల్ సప్లై ద్వారా అన్ని మండలాల్లో బఫర్ స్టాకు సిద్ధంగా ఉంచాలని అన్నారు. అవకతవకలకు పాల్పడిన డీలర్లను తొలగించి మహిళా గ్రూపులకు ఆ బాధ్యతలను అప్పగించాలని ఆదేశించారు. పోలీసు రెవెన్యూ ఐటీడీఏ, ఇతర శాఖల అధికారులు దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని 16 గ్రామాలకు వరద ముంపు అధికంగా ఉన్నందున పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలన్నారు. గిరిజన గ్రామాల్లోని పాఠశాలల పట్ల ఐటీడీఏ పీఓ ప్రత్యేక బాధ్యత వహించాలన్నారు. దేవస్థానం భూములను సర్వే చేసి భక్తులకు ఉపయోగపడేలా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. కాగా తొలుత ఆయన బ్రిడ్జిపై నుంచి, కరకట్టపై నుంచి వరద ఉధృతిని పరిశీలించారు. కూనవరం రోడ్డులో నిర్మిస్తున్న కొత్త కరకట్టను పరిశీలించి అధికారులకు పలు సూచనలను చేశారు. ఈ కార్యక్రమాల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఆర్డీఓ దామోదర్ రావు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

కారు నడిపిన పీఓ



కారు నడుపుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్, పక్కన కూర్చున్న మంత్రి తుమ్మల

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూనవరం రోడ్డులో కరకట్ట నిర్మాణాన్ని పరిశీలించిన అనంతరం అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే సమీక్ష సమావేశానికి బయల్దేరారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కారును భద్రాచలం ఐటీడీఏ పీఓ నడుపుతుండగా, మంత్రి తుమ్మల పక్కన కూర్చున్నారు. అదే కారులో వెనుక కలెక్టర్ జితేష్.వి.పాటిల్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎస్పీ రోహిత్‌రాజు కూర్చునున్నారు.

అందుబాటులోకి ఈపీఓ ఔషధం

- రూ.5 లక్షలతో కొనుగోలు చేసి కేంద్రాలకు సరఫరా
- తీరిన డయాలసిస్ బాధితుల వెతలు



చికిత్స పొందుతున్న డయాలసిస్ రోగులు

ఇల్లెందు: జిల్లాలోని అన్ని డయాలసిస్ కేంద్రాలకు ఎరిత్రోపోయితిన్(ఈపీఓ) ఇంజక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. సుమారు రూ.5 లక్షలు కేటాయించగా, రెండు నెలలకు సరిపడా స్టాక్ కొనుగోలు చేసి అందించారు. గత నెల 28న 'సాక్షి'లో 'ఈపీఓ.. స్టాక్ నిల్'శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్పందించి నిధులు కేటాయించారు. సమస్యను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి తీసుకెళ్లగా, ప్రతీ నెలా కొరత లేకుండా మందులు సరఫరా చేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. 'సాక్షి'కథనంతో జిల్లాలోని అన్ని డయాలసిస్ కేంద్రాలకు ఈపీఓ ఇంజెక్షన్లు సరఫరా అవుతున్నాయని డీసీహెచ్ఎస్ డాక్టర్ జి.రవిబాబు తెలిపారు. రెండు నెలలకు సరిపడా స్టాక్ బుధవారం జిల్లాకు చేరిందని, ప్రతి నెలా మందులు అందేలా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ నుంచి కూడా ఆదేశాలు అందాయని పేర్కొన్నారు. డయాలసిస్ బాధితులు ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు.

వైద్య కళాశాలలో క్యాంటీన్ మూత

20 రోజులుగా టిఫిన్, భోజనాల కోసం మెడికోల అవస్థలు



ప్రభుత్వ వైద్య కళాశాల

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వ వైద్యకళాశాలలోని క్యాంటీన్ 20 రోజుల నుంచి మూతబడి ఉంది. వైద్య కళాశాల సమీపంలో ఒక్క హోటల్ కూడా లేదు. దీంతో మెడికోలు టిఫిన్, భోజనం కోసం అవస్థ పడుతున్నారు. వైద్య కళాశాలలో 300 విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుతున్నారు. వీరికి వైద్య కళాశాలలోని క్యాంటీన్ ద్వారా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం అన్నం, రాత్రి అన్నం/చపాతీలు అందించేవారు. 20 రోజుల నుంచి క్యాంటీన్ తెరవకపోడంతో విద్యార్థులు ఆటోల్లో దూర ప్రాంతాలకు వెళ్లి తినాల్సి వస్తోంది. రోజూ టిఫిన్, రెండు పూటల భోజనం, స్నాక్స్ సరఫరా చేసేందుకు ప్రతి నెలా ఒక్కో విద్యార్థి రూ.3,900 చొప్పున క్యాంటీన్ నిర్వాహకులకు చెల్లిస్తున్నారు. వైద్య కళాశాలల భవనాల నిర్మాణం పూర్తికాకపోవడంతో నర్సింగ్ కళాశాల కోసం నిర్మించిన భవనంలో ప్రస్తుతం వైద్య కళాశాల కొనసాగుతోంది. దీంతో వైద్య విద్యార్థులకు నవభారత్ సెంటర్‌లో భవనం అద్దెకు తీసుకుని వసతి కల్పిస్తున్నారు. విద్యార్థినులకు పాల్వంచలో వసతి ఏర్పాటు చేశారు. వీరంతా రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్ క్యాంటీన్‌లో తినేవారు. సాయంత్రం స్నాక్స్ వైద్య కళాశాలలో తినేవారు. రాత్రి డిన్నర్ మాత్రం క్యాంటీన్ నిర్వాహకులు తయారు చేసి హాస్టళ్లకు పంపించేవారు. 20 రోజుల నుంచి క్యాంటీన్ బంద్ కావడంతో లంచ్ కోసం కళాశాల నుంచి ఆటోల్లో బయటకు వెళ్లి తినిరావాల్సి వస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా క్యాంటీన్ బంద్ చేశారని కొందరు మెడికోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్యాంటీన్ తెరిపించాలని కోరుతున్నారు.

ఓటరు సర్వే 51శాతం పూర్తి

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇంటింటి ఓటరు సర్వే 51శాతం పూర్తయిందని, ఈనెల 20వ తేదీ నాటికి మొత్తం పూర్తిచేస్తామని అదనపు కలెక్టర్(రెవెన్యూ) డి.వేణుగోపాల్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు చేయించాలని సూచించారు. మరణించిన, రెండు ఓట్లు ఉన్న వారిని గుర్తించి బూత్ లెవల్ అధికారులతో విచారణ జరిపించి తొలగింపులు, సవరణలు చేపడతామన్నారు. బీఎల్ఓలు ఇంటింటి సర్వే చేపడుతున్నారని, మార్పు చేర్పులను యాప్‌లో, రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారని వివరించారు. సమావేశంలో తహసీల్దార్ వి.కృష్ణప్రసాద్, ఎన్నికల నాయబ్ తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ, రాజకీయ పార్టీల నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, తుమ్మ రాంబాబు, గన్నిన రామకృష్ణ, సత్యవరపు సంపూర్ణ, గన్నిన రామకృష్ణ, మడకం ప్రసాద్, బండారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

శాంతిస్తున్న గోదారి

- ఉదయం ఏడు గంటలకు 50.30 అడుగులకు చేరిన నీటిమట్టం
- క్రమంగా రాత్రి 12గంటలకు 46.40 అడుగులకు తగ్గిన వరద
- ఇప్పటికే మూడుసార్లు రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవాహం



భద్రాచలం వద్ద ప్రవహిస్తున్న గోదావరి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించిన గోదావరి బుధవారం తగ్గుముఖం పట్టింది. మంగళవారం రాత్రి 11 గంటలకు నీటిమట్టం 49.60 అడుగులుగా నమోదు కాగా, బుధవారం ఉదయం 7 గంటల వరకు వరద క్రమంగా పెరుగుతూ 50.30 అడుగులకు చేరింది. అప్పటి నుంచి 10 గంటల వరకు నిలకడగా ఉన్న గోదావరిలో, ఉదయం 11 గంటల నుంచి వరద ప్రవాహం తగ్గుతోంది. సాయంత్రం 4 గంటలకు 49 అడుగులకు తగ్గింది. 11,39,375 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళ్తోంది. రాత్రి 7.47 గంటలకు 48 అడుగుల కంటే దిగువకు రావడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. రాత్రి 12 గంటలకు 46.40 అడుగులకు తగ్గిపోయింది.

ఎగువ నుంచి తగ్గిన వరద

గోదావరికి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు సైతం తగ్గాయి. శ్రీరామ్ సాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి కూడా ప్రవాహం తక్కువగా ఉంది. తుపాకులగూడెంలోని సమ్మక్క సారక్క బ్యారేజీ నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. చర్లలోని తాలిపేరు, ప్రశాంతంగా ఉండగా, గోదావరికి దిగువన శబరి ఉప నది ప్రస్తుతానికి 4 గంటలకు 54.47 అడుగుల వద్ద నిలకడగా ఉంది. నీటిప్రవాహం చాలా తక్కువగా ఉండటంతో భద్రాచలం వద్ద గోదావరి వరద గురువారం సైతం తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ఐదుసార్లు మొదటి ప్రమాద హెచ్చరిక దాటి..

భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం ఐదుసార్లు మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించగా, మూడు సార్లు రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. కేవలం ఒక్కసారే మూడో ప్రమాదహెచ్చరికను దాటి ప్రవహించింది. తాజాగా గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించినా, వర్షం లేకపోవడంతో ముంపు కాలనీలకు బ్యాక్ వాటర్ సమస్య తలెత్తలేదు. దీంతో అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. మరో పక్క కరకట్టను పొడిగించడం కారణంగా కూనవరం రోడ్డు ద్వారా పట్టణంలోకి వచ్చే వరద నీటికి కూడా అడ్డుకట్ట వేసినట్లయింది.

ప్రజాపాలన దినోత్సవానికి ముఖ్యఅతిథిగా మంత్రి తుమ్మల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 17న తేదీన ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లాలకు ఇన్‌చార్జిలుగా పలువురు మంత్రులను నియమించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును నియమించగా, ఆయన ఈ నెల 17న జిల్లాలో జరిగే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

అధికంగా సభ్యత్వం చేయాలి

బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు

కొత్తగూడెంటౌన్: భారతీయ జనతా పార్టీ సభ్యత్వాన్ని జిల్లాలో రికార్డు స్థాయిలో నమోదు చేయించాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బుధవారం కొత్తగూడెంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అమర వీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో అత్యధికంగా పార్టీ సభ్యత్వం నమోదు చేయాలన్నారు. ప్రతి బూత్‌లో 200 సభ్యత్వం చేసి అగ్రభాగాన నిలబెట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజలందరికీ నరేంద్రమోదీ, మోదీ పాలన అంటే ఇష్టమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలకు నమ్మకం పోతోందని అన్నారు. హైడ్రాతో భయపెట్టడం తప్ప ప్రజలకు సంక్షేమ పాలన ఇవ్వడం లేదని, ప్రజాపాలన గాలికి వదిలారని విమర్శించారు. హైడ్రా అనే భూతం చూపి అనేక సంక్షేమ కార్యక్రమాలను ఆపివేశారని అన్నారు. అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం-కొవ్వూరు రైల్వే లైన్ ఏర్పాటుపై రైల్వే జీఎంతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటానని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓటరు నమోదు జిల్లా ప్రభారి వర్ధన్‌రెడ్డి, సహ ప్రభారి రాజేష్, జిల్లా కన్వీనర్ పానిశెట్టి వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ తాటిపాముల ఐలయ్య, నాయకులు ముసలయ్య, బైరి నిర్మల, కొదమసింహం పాండురంగాచార్యులు, ముసుకు శ్రీనివాసరెడ్డి, బానోతు విజయలక్ష్మి, కుంజా ధర్మా, పోడియం బాలరాజు, గొడుగు శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి ఒలింపియాడ్‌లో సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎంవీఎస్ రెడ్డి

పాల్వంచ: ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 14వ జాతీయస్థాయి సీఆర్ రావు స్టాటిస్టిక్స్ ఒలింపియాడ్‌లో పాల్వంచ నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 10వ తేదీన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఒలింపియాడ్‌లో 2వ ర్యాంక్ సాధించిన బోయపాటి శ్రీచైత్రకు ప్రశంసాపత్రంతో పాటు రూ.20 వేల నగదు, 4వ ర్యాంక్ సాధించిన నాగసాయి కృష్ణతేజకు ప్రశంసాపత్రం, రూ.5 వేల నగదును సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎంఎస్.రావు అందించారు. కార్యక్రమంలో వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. బుధవారం విజేతలను పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎంవీఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీదేవి, గణిత ఉపాధ్యాయుడు వీరబ్రహ్మేందర్ అభినందించారు.

18 నుంచి డీఈఎల్ ఈడీ థియరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 18 నుంచి 24 వరకు డీఈఎల్ఈడీ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలు జరుగుతాయని డీఈఓ వెంకటేశ్వరచారి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పూర్తి వివరాల కోసం ఎస్.మాధవరావు 89192 79238 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు జాంబియాకు మిమిక్రీ రమేష్



కళాకారుడు రమేష్

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 12,13 తేదీల్లో జాంబియాలోని లుసాకాలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కొత్తగూడెనికి చెందిన మిమిక్రీ కళాకారుడు రమేష్ గురువారం వెళ్లనున్నారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. తనతోపాటు నల్లగొండ గద్దర్ నరసన్న, రేలారే గంగ కూడా హాజరవుతారని తెలిపారు.

రోగులతో పీహెచ్‌సీ కిటకిట..



పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చిన ప్రజలు

టేకులపల్లి: సీజనల్ వ్యాధులతో మండల ప్రజలు నానా అవస్థ పడుతున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లోపించడం, కురుస్తున్న వర్షాలతోపాటు పలు కారణాలతో జ్వర పీడితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నా, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా జ్వరాలు విజృంభిస్తున్నాయి. సోమవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగులతో కిటకిటలాడింది. రోజూ 90 - 120 వరకు ఓపీ ఉంటుండం గమనార్హం. మండలంలోని ఆర్ఎంపీల వద్ద, ఇటు పీహెచ్‌సీలోనూ రోగుల సంఖ్య పెరుగుతోంది. చికిత్స అనంతరం రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని వైద్యాధికారి కందుల దినేశ్ తెలిపారు.

అనారోగ్యంతో ఎఫ్‌బీఓ మృతి



బాలరాజు (ఫైల్)


ఇల్లెందు: లలితాపురం చెక్‌పోస్టు బీట్ ఆఫీసర్ బి.బాలరాజు (56) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. 30 ఏళ్లుగా ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌లో బీట్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తూ ఇల్లెందులోనే స్థిరపడ్డారు. అశ్వాపురం మండలం గొందిగూడెం గ్రామానికి చెందిన బాలరాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన మృతి పట్ల ఎఫ్‌డీఓ కె.వెంకన్న, ఎఫ్ఆర్ఓ ప్రసాద్, జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ రాష్ట్ర నాయకులు బి.కోటేశ్వరరావు తదితరులు సంతాపం ప్రకటించారు.

చికిత్స పొందుతున్న వివాహిత...

పాల్వంచరూరల్: పురుగులమందు తాగిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మండలంలోని కోడిపుంజులవాగు పంచాయతీ పూసలతండాకు చెందిన బాదావత్ స్వాతి (25) కడుపునొప్పి తాళలేక గత నెల 22న పురుగులమందు తాగింది. ఆమెను భర్త హరికృష్ణ కొత్తగూడెం ఏరియాస్పత్రికి తరలించగా కొన్నిరోజులు చికిత్స పొందింది. తర్వాత ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలికి పాప, బాబు ఉన్నారు. కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

రేషన్ కార్డులు ఎప్పుడొస్తాయో?

- 17 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమంటూ ప్రచారం
- నేమ్ ఎడిట్‌కు 20 వేల కార్డులు పెండింగ్‌లో..
- జిల్లాలో 50 వేలకు పైగా కొత్తవి పెరిగే అవకాశం
- ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్న లబ్ధిదారులు..



పాల్వంచలోని రేషన్ దుకాణం



కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ రేషన్‌కార్డు ప్రమాణికం చేసి అర్హులైన వారికి లబ్ధి చేకూర్చుతుండటం ఎప్పటినుంచో కొనసాగుతోంది. కాగా పదేళ్లలో నేమ్ ఎడిట్ ఆప్షన్ తప్ప కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరగడం లేదు. అర్హత ఉండి కూడా చాలా మంది నిరుపేదలు రేషన్‌కార్డు లేకపోవడంతో వారికి చెందాల్సిన సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే పీడీఎఫ్ బియ్యాన్ని కూడా తీసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో దాదాపు పదేళ్లుగా అర్హులైన వారు పథకాలను పొందలేక అవస్థలు పడుతున్నారు. అయితే ప్రస్తుతం నూతన ప్రభుత్వంలో గత నెలలోనే కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ ప్రారంభమవుతుందనే ప్రచారం జోరుగా సాగింది. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో లబ్ధిదారులు నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం మళ్లీ ఈ నెల 17వ తేదీ నుంచి ప్రజాపాలన కార్యక్రమాల ద్వారా నూతన రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి గైడ్‌లైన్స్ రాకపోవడంతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు దరఖాస్తుల ప్రకటనపై అధికారికంగా ధ్రువీకరించడం లేదు. దీంతో రేషన్‌కార్డుల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకొని నూతన రేషన్‌కార్డుల ప్రక్రియను ప్రారంభించాలని కోరుతున్నారు.

పెండింగ్‌లో 20 వేల దరఖాస్తులు..

జిల్లాలో 443 రేషన్ దుకాణాలున్నాయి. 2,93,632 రేషన్ కార్డుల్లో అంత్యోదయ కార్డులు 18,822, ఆహార భద్రత 2,79,190 కార్డులున్నాయి. గత ప్రభుత్వంలో రేషన్‌కార్డుల్లో పేర్లను చేర్చడం, పేర్లను ఎడిట్ చేయడం కోసం అవకాశం కల్పించడంతో అప్పట్లో దాదాపు 20 వేల మంది వరకు పేర్ల ఎడిట్, యాడ్ చేయడం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులకు సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో జిల్లాలో 20 వేల కార్డుల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం ప్రకటన చేస్తే ఎడిట్ కోసం పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డు ప్రక్రియ కూడా ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది. మరో 50 వేల మంది వరకు నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

చాలామందికి ఇబ్బంది..

రేషన్‌కార్డులు లేని, పలు పథకాలు పొందే అర్హులైన నిరుపేదలు జిల్లాలో చాలామంది ఉన్నట్లు సమాచారం. గతంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ వివిధ కారణాలు చూపుతూ అర్హులైన వారికి కూడా రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. దీంతో అర్హులై ఉండి కూడా ఆరోగ్యశ్రీ వర్తించకపోవడం, స్కాలర్‌షిప్‌లు కొన్ని కొన్ని విద్యా సంస్థల్లో ఇవ్వకపోవడం, ఉన్నత చదువుల కోసం ఆదాయ సర్టిఫికెట్ పొందాలంటే తప్పనిసరిగా రేషన్‌కార్డును ప్రమాణీకంగా తీసుకుంటున్నారు. ఆదాయ సర్టిఫికెట్ లేకపోతే పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల దరఖాస్తుకు, రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియను త్వరగా ప్రారంభించి నిరుపేదలను ఆదుకోవాల్సిన అవసరముందని పలువురు కోరుతున్నారు.

అధికారిక ప్రకటన ఏదీ రాలేదు



కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన ఇంకా ఏమీ రాలేదు. ప్రకటన వచ్చిన తరువాత ప్రక్రియ ప్రారంభించి జిల్లాలో దరఖాస్తు చేసుకునే అర్హులకు రేషన్‌కార్డులు అందే విధంగా చూస్తాం. కొత్త రేషన్‌కార్డులకు ప్రకటన వస్తే, నేమ్ ఎడిట్‌కు పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డు ప్రక్రియ కూడా ప్రారంభమయ్యే అవకాశం ఉండవచ్చు.

– రుక్మిణి, పౌర సరఫరాలశాఖ అధికారిణి

ఎస్పీ గారూ.. చర్ల వెళ్లొచ్చా?

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం



ఎస్పీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

భద్రాచలంఅర్బన్: నియోజకవర్గ ప్రజలను కలుసుకునేందుకు తాను చర్ల మండలానికి వెళ్లొచ్చా అని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఎస్పీ రోహిత్‌రాజ్‌ను అడిగారు. బుధవారం భద్రాచలంలో మంత్రి తుమ్మల పర్యటనలో భాగంగా ఈ ఆసక్తికర సంభాషణ చోటుచేసుకుంది. ఇటీవల మావోయిస్టులు, పోలీసుల నడుమ జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లతో ఏజెన్సీలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మావోయిస్టులు సైతం ప్రజాప్రతినిధులను హెచ్చరిస్తూ లేఖలు విడుదల చేయడంతో ఏజెన్సీలో ప్రజాప్రతినిధుల పర్యటనలకు పోలీసులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఈ క్రమంలో ఎస్పీ, ఎమ్మెల్యేల సంభాషణ చర్చనీయాంశమైంది. అయితే తగిన బందోబస్తు, ఇతర జాగ్రత్తలతో పర్యటనకు వెళ్లాలని ఎస్పీ సూచించారు.

వచ్చే నెలలో ఐద్వా రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

ములకలపల్లి : భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలో వచ్చే నెలలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 4వ మహాసభలు నిర్వహిస్తున్నామని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. ములకలపల్లిలో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మహాసభలకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా ప్రధాన కార్యదర్శి మందలపు జ్యోతి, నాయకులు వాణి, మేకల అనసూర్య, పాయం అమల పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల కష్టాలు తీరుస్తాం

ఐటీడీఏ పీఓ రాహుల్



అధికారులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సింగ్ ట్రెనింగ్ కళాశాలలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. బుధవారం ఆయన భద్రాచలంలోని పీఎంహెచ్, ఐటీడీఏ ప్రాంగణంలోని నర్సింగ్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ శాశ్వత భవన నిర్మాణానికి అనువైన స్థలం గుర్తించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని అన్నారు. రిపేర్‌లో ఉన్న అంబులెన్స్‌లను వెంటనే మరమ్మతు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇంకేమైనా సమస్యలుంటే తనకు ప్రతిపాదనలు అందించాలని ఇంజనీరింగ్ అధికారులకు చెప్పారు. వంట షెడ్‌ను తాత్కాలికంగా బయట ఏర్పాటు చేయాలని, కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు సెల్‌ఫోన్లు అందుబాటులో లేకుండా వార్డెన్లు పర్యవేక్షించాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, డీఈ హరీష్, టీఏ శ్రీనివాస్, డాక్టర్ చైతన్య, వార్డెన్లు సుశీల, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో ప్రారంభమైన నిమజ్జనాలు



విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరిలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. గణనాథునికి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి భక్తులు మేళతాళాలు, డప్పుచప్పులతో బాణాసంచా కాల్చుతూ.. ఊరేగింపుగా గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాటుకు తరలించి అక్కడ నిమజ్జనం చేశారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు భక్తులను తీరం వరకు అనుమతించకుండా స్నానఘట్టాల వద్ద స్నానాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లాంచీలు, బోట్లలో గోదావరి మధ్యలో గణనాథులను వదులుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిమజ్జన ఘాట్ వద్ద విద్యుత్ సౌకర్యంతో పాటు నిత్యం పోలీసుల నిఘా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

దొంగల బీభత్సం

వృద్ధ దంపతులపై కర్రలతో దాడి చేసి దోపిడీ



గాయపడిన సూర్యనారాయణ

అశ్వారావుపేటరూరల్: గుర్తు తెలియని దోపిడీ దొంగలు వృద్ధ దంపతులపై కర్రలతో దాడికి పాల్పడి బీభత్సం సృష్టించిన ఘటన కలకలం రేపింది. ఎస్ఐ శివరామకృష్ణ, బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెంకాలనీకి చెందిన తుమ్మలపల్లి సూర్యనారాయణ, భార్య కళావతి జాతీయ రహదారి సమీపంలో కిరాణా, కూల్ డ్రింక్స్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా, బుధవారం తెల్లవారుజామున సూర్యనారాయణ మూత్ర విసర్జన చేసేందుకు తలుపు తీసి బయటకు వచ్చారు. ఇదే సమయంలో అక్కడే మాటు వేసి ఉన్న గుర్తు తెలియని ఇద్దరు దుండగులు మంకీ క్యాప్‌లు ధరించి ఒక్కసారిగా లోపలికి వెళ్లేందుకు యత్నించారు. సూర్యనారాయణ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, దుండగులు కర్రలతో దాడికి పాల్పడటంతో రక్తస్రావమైంది. దాడి ఘటనతో బాధితుడు గట్టిగా కేకలు పెట్టడంతో లోపల నిద్రిస్తున్న భార్య కళావతి బయటకు రాగా, దుండగులు ఆమెపై కుడా కర్రలతో దాడి చేసి ఆమె మెడలో ఉన్న 20 గ్రాముల బంగారపు పుస్తెల తాడును లాక్కున్నారు. బాధితుల కేకలతో చుట్టు పక్కల వారు బయటకు రావడంతో గమనించిన దుండగులు ద్విచక్రవాహనంపై అక్కడి నుంచి పారిపోయారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించి, దుండుగలను పట్టుకునేందుకు వెంబడించినా వారు చిక్కలేదు. గాయపడిన దంపతులను స్థానికులు అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడాకారుడికి చేయూతనివ్వండి



వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు మోడెం వంశీ 21 ఏళ్లకే పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అంతర్జాతీయస్థాయిలో రాణిస్తూ బంగారు పతకాలను సాధిస్తున్నాడని, ఆదివాసీ గిరిజన క్రీడాకారుడుకి ప్రభుత్వం తరఫున చేయూతనివ్వాలని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేనా రెడ్డిని కలిసిన భద్రాద్రి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశానికి బంగారు పతకం సాధించాడని తెలిపారు. అక్టోబర్ 4 నుంచి 13వ తేదీ వరకు సౌత్ ఆఫ్రికాలోని సన్‌సిటీలో జరిగే కామన్వెల్త్ గేమ్స్‌లో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెలంగాణ తరఫున భారత్‌కు వంశీ ఎంపికయ్యాడన్నారు. అనంతరం శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. సౌతాఫ్రికాలో జరగబోయే కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెలంగాణకు బంగారు పతకం తీసుకురావాలని వంశీని ఆశీర్వదించారు. అనంతరం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జీవీ రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి కృష్ణాజి పాల్గొన్నారు.

సింగరేణిలో నలుగురు వైద్యుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న డీవైసీఎం వైద్యులను బదిలీ చేస్తూ యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. వారిలో ఆర్జీ–1 ఏరియాస్పత్రిలో పనిచేస్తున్న డీవైసీఎంఓ బెల్లంపెల్లి ఏరియాస్పత్రికి, మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ ఆస్పత్రి డీవైసీఎంఓ కేఎస్ విశ్వమేధిని కొత్తగూడెంలోని ప్రధాన ఆస్పత్రికి, కొత్తగూడెం ఏరియా మెయిన్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ మేరీ శ్యామలను మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ ఏరియాస్పత్రికి, కొత్తగూడెం మెయిన్ ఆస్పత్రి ఫిజియో స్పెషలిస్ట్ దూడెం స్రవంతిని ఆర్జీ–1 ఏరియా ఆస్పత్రికి బదిలీ చేసి, 25వ తేదీలోగా విధుల్లో చేరాని ఉత్తర్వుల్లో యాజమాన్యం పేర్కొంది.

వరకట్న వేధింపుల కేసులో ఒకరికి జైలు

కొత్తగూడెంటౌన్: అదనపు కట్నం తేవాలని భార్యను వేధించిన కేసులో కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పెద్దతండాకు చెందిన భూక్య బాలుకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం కొత్తగూడెం మూడో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ తీర్పు చెప్పారు. లక్ష్మీదేవిపల్లి రేగళ్ల పెద్దతండాకు చెందిన విజయను అదే గ్రామానికి చెందిన భూక్య బాలుకు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.2 లక్షల కట్నంతో పాటు ద్విచక్ర వాహనం, సామగ్రి ఇచ్చారు. తర్వాత బాలు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని.. 2012, అక్టోబర్ 10న తన భార్యను రూ.లక్ష అదనపు కట్నం తేవాలని ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. దీంతో బాధితురాలు అప్పటి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. భూక్య బాలుపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎస్.లావాణ్య వాదించగా.. లైజన్ ఆఫీసర్ ఘని, పీసీ పరసా రామకృష్ణ సహకరించారు.

వ్యాన్‌లో తరలిస్తున్న పశువుల పట్టివేత



పశువులను చూపుతున్న బీజేపీ నాయకులు

పాల్వంచ: నవభారత్‌లోని అన్నపూర్ణ గోశాల నుంచి ఎద్దులను తరలిస్తుండగా బీజేపీ నాయకులు మంగళవారం పట్టుకున్నారు. ఓ వ్యాన్‌లో పది ఎద్దులను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్యా రవినాయక్, జిల్లా నాయకులు భట్టు శివ, గంధం నాగేంద్రప్రసాద్, బానోతు ప్రతాప్ కలిసి శేఖరం బంజర నుంచి వెంబడించి నవభారత్ వద్ద పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో తరలిస్తున్నవారితో వాగ్వాదానికి దిగారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీ నాయకుల ఫిర్యాదుతో పశువులను తరలిస్తున్న మున్నా, కరీంపై పట్టణ ఎస్ఐ సుమన్‌కు కేసు నమోదు చేశారు.

పెద్దమ్మగుడి చిన్న ఫంక్షన్‌హాల్ స్వాధీనం

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడికి చెందిన చిన్న ఫంక్షన్ హాల్‌ను ఈఓ రజనీకుమారి స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి చెందిన రెండు ఫంక్షన్‌హాళ్లు ఉండగా.. 700 మంది సామర్థ్యం కలిగిన దానిని రూ.40,04,000కు, 500 మంది సామర్థ్యం కలిగిన దానిని రూ.34,52,000కు గతేడాది కాంట్రాక్టు పద్ధతిపై అద్దెకిచ్చారు. అయితే ఫంక్షన్‌హాళ్లను కాంట్రాక్టు తీసుకున్నవారు నిర్దేశిత గడువులో అద్దె చెల్లించడంలేదని ఈఓ రజనీకుమారి ఇటీవల రెండు ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు. చిన్న ఫంక్షన్ హాల్ సక్రమంగా నడవటం లేదని, అప్పులవుతున్నాయని నిర్వాహకుడు రెండు రోజుల కిందట ఈఓకు అప్పగించారు. ఈఓ ఆ ఫంక్షన్‌హాల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కట్టుబట్టలే మిగిలాయి..

- సర్వం కోల్పోయాం.. ఆదుకోండి
- కేంద్ర బృందానికి వరద బాధితుల వేడుకోలు
- వరద నష్టాన్ని చూసి చలించిన బృందం సభ్యులు
- దెబ్బతిన్న పంటలు, ఇళ్ల పరిశీలన
- నష్టాన్ని బృందానికి వివరించిన కలెక్టర్



రాకాసితండా ఆకేరు బ్రిడ్జి ప్రాంతంలో దెబ్బతిన్న పంటలను వివరిస్తున్న బృందం సభ్యులకు వివరిస్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

తిరుమలాయపాలెం/కూసుమంచి/ఖమ్మంవన్‌టౌన్ : ఒక్కసారిగా వచ్చిన వరదలతో సర్వస్వం కోల్పోయాం.. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగలలేదు.. పంటలు, ఇళ్లతో పాటు ఇంట్లో దాచుకున్న నగదు, నగలు, నిత్యావసరాలన్నీ నీట మునిగాయి.. ఈ తరుణంలో ప్రభుత్వమే తమను ఆదుకోవాలి అంటూ వరద బాధితులు కేంద్ర బృందాన్ని వేడుకున్నారు. వరద ముంపునకు గురైన తిరుమలాయపాలెం మండలం రాకాసితండా, కూసుమంచి మండలం భగవత్‌వీడు, ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడు, తనకంపాడు, కస్నాతండాలో కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. రెండు బృందాలుగా విడిపోయిన సభ్యులు మొదట పాలేరు పరీవాహక ప్రాంతంలో జరిగిన నష్టాన్ని పరిశీలించారు. భగవత్‌వీడులో దెబ్బతిన్న పొలాల ను, అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను చూశారు. పాలేరు పరీవాహకంలో 25 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సభ్యులకు వివరించారు. జాతీయ రహదారి గుండా పాలేరు వాగును, కోతకు గురైన జాతీయ రహదారిని చూపించారు. రైతులు సైతం తమ గోడును అధికారులకు విన్నవించారు. దెబ్బతిన్న వరి, కోతకు గురైన పొలాలు, ఇసుక మేటల ఫొటోలు చూసి బృందం సభ్యులు చలించిపోయారు. కోక్యాతండాకు చెందిన రైతు హలావత్ నర్సింహారావు పంట నష్టం గురించి తెలపగా ఈ నష్టం పూడ్చలేనిదని, రైతులను అన్ని విధాలా ఆదుకునేలా తాము కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో పర్యటించగా.. బాధితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆకేరు వరదలు ఒక్కసారిగా గ్రామాన్ని చుట్టుముట్టాయ ని, కట్టుబట్టలతో కొండలు, గుట్టలు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నామని చెప్పారు. వేల రూపాయల పెట్టుబడితో పండించిన పంటలు పూర్తిగా నీటి పాలయ్యాయని, ఇసుక మేటలు వేయడంతో తిరిగి సాగుచేసే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఇల్లు పూర్తిగా మునిగి పోయిందని, వచ్చి చూడాలని ఓ మహిళ కోరగా బృందం సభ్యుడు ఆ ఇంటికి వెళ్లి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యం, బియ్యం, కూలిన ఇళ్లను చూసి సభ్యులు చలించిపోయారు. ఆ తర్వాత ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించిన సభ్యులు తనగంపాడులో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. పొలాల్లో వేసిన ఇసుక మేటల తొలగింపునకు ఎంత ఖర్చవుతుందని కలెక్టర్‌తో పాటు రైతులను అడిగి తెలుసుకున్నారు. కస్నాతండాలో ముంపు ప్రాంతాలను సందర్శించి నష్టం గురించి గ్రామస్తులను అడిగారు.

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ నేతృత్వం వహించిన ఈ బృందంలో మహేష్‌కుమార్, శాంతినాథ్, శివప్ప, ఎస్‌కే కుష్వాహ, టీ నియాల్ కన్సన్, డాక్టర్ శ్రీ శశివర్ధన్ సభ్యులుగా ఉన్నారు. వారి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్, రాష్ట్ర గనులు, భూగర్భ ఖనిజాల శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలక్టర్ మధుసూధన్ నాయక్, జలవనరుల శాఖ ఎస్ఈ నర్సింహారావు, జెన్‌కో ఎస్ఈ దేశ్యా, కూసుమంచి ఏడీఏ సరిత, ట్రాన్స్‌కో ఏడీఏ కోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.